

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక

సిరికొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై మూడో విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీందర్ మంగళవారం తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వరకు మండలంలోని 19 గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు నిర్వహించి తుది నివేదికను సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధి కూలీలు, ఈజీఎస్ సిబ్బంది, ప్రజలు హాజరుకావాలన్నారు.



● బేల మండలం సాంగిడి గ్రామ సమీపంలో పెన్‌గంగా నదిలో చేపడుతున్న ఇసుక తవ్వకాలు

దర్జాగా దందా!

- పట్టపగలే పెన్‌గంగా నదిలో ఇసుక తవ్వకాలు
- జిల్లా అధికారుల హెచ్చరికలు బేఖాతరు
- రాజకీయ అండతో రెచ్చిపోతున్న ఖద్దర్ నేతలు
- ఒత్తిళ్లతో వెనుకడుగు వేస్తున్న మైనింగ్ శాఖ అధికారులు
- జిల్లాలోని సరిహద్దు మండలాల్లో విచ్చలవిడిగా దందా

పట్టపగలే ఇసుక తవ్వకాలు

ఆదిలాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేస్తున్నామని అధికారులు పదేపదే చెబుతున్నా.. మైనింగ్ మాఫియా మాత్రం తగ్గేదే లేదంటూ అడ్డగోలుగా తవ్వేస్తూ అమ్మేసుకుంటున్నారు. రాత్రీ, పగలు తేడా లేకుండా పెన్‌గంగా నదిని జల్లెడ పడుతూ యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారు. జిల్లాలోని సరిహద్దు మండలాలైన భీంపూర్, తాంసి, తలమడుగు, జైనత్, బేల మండలాల్లో విచ్చలవిడిగా ఇసుక దందా సాగుతుంది. అన్ని తెలిసినా అధికారులే అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలే లక్షలు పెట్టి టెండర్లను దక్కించుకున్న బడా నేతలు బినామీ వ్యాపారులను బరిలోకి దింపి అడ్డగోలుగా దోపిడీ దందాకు ఎగబడుతున్నారు. నిత్యం మహారాష్ట్ర జిల్లాకేంద్రంతో పాటు పలు మండలాలకు వందలాది ట్రాక్టర్, టిప్పర్లలో ఇసుకను తరలిస్తూ దండుకుంటున్నారు. యేటా ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం నష్టపోతున్నా.. ఆపేవారే లేరన్న ఆరోపణలు వస్తున్నాయి. ఏదైనా ఫిర్యాదు వస్తేనే అధికారులు హడావుడి చేస్తున్నా.. ఆ తర్వాత అంతా మాములుగానే మారుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటే రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖాధికారులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


భారీ యంత్రాలతో తవ్వకాలు

కూలీలతో ఇసుక తవ్వకాలు చేపడితే ఏమూలాన సరిపోవడం లేదంటూ ఇసుక మాఫియా కొత్త ఎత్తుగడలు వేస్తోంది. భారీ యంత్రాల సహాయంతో తవ్వకాలను చేపడుతూ ఇసుకను తరలిస్తున్నారు. నీటి ప్రవాహంలో విద్యుత్ మోటార్ల ద్వారా ఇసుకను తవ్వి ఒడ్డుకు చేర్చుతున్నారు. దీనిని జల్లెడ పట్టి మరి అమ్మేసుకుంటున్నారు. ఏదో రాత్రివేళల్లో తవ్వకాలు చేపడుతున్నారంటే పొరపాటే. పగలంతా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలను చేపడుతున్నా.. అధికారులు అడ్డుచెప్పడం లేదంటున్నారు. కనీసం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయడం లేదంటే.. పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో తెలుస్తూనే ఉంది. మహారాష్ట్ర వైపు ఇసుక రాయిని కూడా తరలించేందుకు అవకాశం లేదంటే అక్కడి అధికారుల పనితీరు ఏవిధంగా తెలుస్తూనే ఉంది. మహారాష్ట్ర ప్రభుత్వం ఇసుక తవ్వకాలపై కఠినంగా వ్యవహరించడంతో ఇసుక మాఫియాకు అడ్డుకట్ట పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కానీ జిల్లా అధికారులు తేలికగానే తీసుకోవడంతో ఏటా కోట్ల రూపాయల ఆదాయం పక్కదారి పడుతోంది.

రెచ్చిపోతున్న నేతలు

నియోజకవర్గస్థాయి నేతల మద్దతు, అండదండలతో ఖద్దర్ నేతలు మరింతగా రెచ్చిపోతున్నారు. రాజకీయ అండదండలతోనే ఇసుక రీచ్‌లను దక్కించుకుంటున్న నేతలు అడ్డగోలు దందాలకు ఎగబడుతున్నారు. ఇసుక మాఫియాకు రాజకీయ నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఆపేవాడే కరువవుతున్నారు. ఇసుక వ్యాపారం కోసమే కొందరు గ్రామ, మండల స్థాయి నేతలు పార్టీలు మారినట్లు తెలుస్తుంది. అధికారంలో ఏ పార్టీ ఉన్న జై కొట్టడం కొందరు నేతలకు అలవాటుగానే మారిందంటున్నారు. ముఖ్యంగా బేల, జైనథ్, భీంపూర్ మండలాల్లో అగ్రనేతల అండదండలతోనే ఇసుక దందా జోరుగా సాగుతున్నట్లు తెలిసింది. రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారుల కనుసన్నల్లోనే అంతా జరుగుతున్న తమకేమి పట్టనట్లుగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

అధికారుల మౌనం



జిల్లాలో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై మైనింగ్ అధికారులు మౌనం వహించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏదో అడపదప దాడులు చేయడం, నామమాత్రమైన కేసులు చేస్తూ వదిలేయడం పరిపాటిగా మారింది. తమ అనుచరుల జోలికి వస్తే సహించేది లేదని అగ్రనేతలు చెప్పడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఉందని అధికారులే బహిరంగంగా చెబుతున్నారు. ఇచ్చింది తీసుకుని సైలెంట్‌గా ఉండాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. నేతల బెదిరింపులకు అధికారులు జంకుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. చెప్పింది వినకుంటే బదిలీ వేటు వేసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో

(తరువాయి 6వ పేజీలో...)





ప్రత్యేక పూజలు నిర్వహించి బయలుదేరిన ఆదివాసీ కొలాం గిరిజనులు

ఆదివాసీ గ్రామాల్లో ఘనంగా కుల దేవత ఉత్సవాలు

ఇంద్రవెల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పుష్య మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో జంగుబాయి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పుష్య మాసం నెలవంక మొక్కిన ఆదివాసీలు వారం రోజుల పాటు తమతమ వంశీయులు ఉన్న గ్రామాల్లో పూజలు నిర్వహణపై ప్రచారం నిర్వహించి తమ వంశం పెర్సపేన్ (పెద్ద దేవుడు), జంగు బాయి దేవతలున్న గ్రామాలకు చేరి కుల దేవత ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం మండలంలోని పాటగూడ, కొలాం, ఆది వాసీలు కుమ్ర వంశీయుల జంగుబాయి దేవత ఉత్సవా లను ఘనంగా ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసి సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ పుణ్య(గంగా) స్నానం కోసం కెరమెరి మండలంలోని జంగుబాయి దేవస్థానంకు బయలుదేరి వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజల మధ్య పుణ్య స్నానం ఆచరించనున్నట్లు తెలిపారు. బుధవారం రాత్రి గ్రామానికి చేరుకుని జంగుబాయి దేవతకు మహా పూజలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఇందులో పూజారి కుమ్ర బాపూరావు, గ్రామపెద్దలు కొడప లక్ష్మణ్, కుమ్ర రాజు, టేకం లేత, కుమ్ర రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.



పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఏఎస్పీ కాజల్

ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఏఎస్పీ కాజల్ సింగ్

ఇంద్రవెల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ రిసెప్షన్, సిబ్బంది పని తీరు, రికార్డులను పరిశీలించి రోడ్డు ప్రమాదాల నివారణకు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ కాజల్ మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. ఇందులో ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సదల్‌పూర్‌లో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆదిలాబాద్ ఎంపీ, ఎమ్మెల్యేలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జైనథ్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ నియోజక వర్గంలోని జైనథ్, బేల మండలాల్లోని ఆయా గ్రామాల్లో గల పలు శంకుస్థాపన కార్యక్రమాలలో మంగళవారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్‌లు పాల్గొన్నారు. జైనథ్ మండలంలోని మాంగూర్ల దత్తగూడలో మల్టిపర్పస్ సెంటర్‌కు రూ.60 లక్షలతో నిర్మించే భవనానికి భూమిపూజ నిర్వహించారు. దీంతో మండలంలోని సదల్‌పూర్ గ్రామంలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించే పాఠశాల అదనపు గదుల భూమిపూజ నిర్వహించారు. అదే విధంగా బేల మండలంలోని పోనాల దేవుజిగూడలో రూ.60లక్షలతో నిర్మించే మల్టిపర్పస్ సెంటర్, రూ.60లక్షల వ్యయంతో మంజూరైన మల్టీపర్పస్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. దీంతో పాటు బేల మండలంలోని సైద్‌పూర్‌లో రూ.50లక్షల వ్యయంతో ఆశ్రమ పాఠశాల డార్మెటరీ గదుల నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఇందులో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీడీ కార్మికులు

అందరికీ పెన్షన్లు అందించాలి

బోథ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అర్హులైన బీడీ కార్మికులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండలంలోని పలు గ్రామాల బీడీ కార్మికులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. దాదాపు 500 మంది కార్మికులు తహసీల్దార్ కార్యాలయం తరలివచ్చి నినాదాలు చేశారు. దీంతో తహసీల్దార్ సుభాష్ చంద్ర బీడీ కార్మికులతో మాట్లాడి జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తామన్నారు. కాగా, విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన జరగకుండా కార్మికులను సముదాయించారు. అయితే కార్మికులు మాత్రం తమకు న్యాయం చేయాలని కోరారు.

సైన్యంలో చేరి దేశ సేవ చేయాలి

● యువకులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● భారత వాయుసేనలో అగ్నివీర్ వాయుగా చేరేందుకు నేటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ● జిల్లాకేంద్రంలోని ఎస్టీయూ భవనంలో అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా



డీఈవో ప్రణీతతో మాట్లాడుతూ..

ఆదిలాబాద్ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): దేశ సేవలో భాగంగా భారత వైమానిక దళంలో చేరేందుకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. భారత వాయుసేనలో అగ్నివీర్ వాయుగా చేరేందుకు ఈనెల 7నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే ఆన్‌లైన్‌లో దరఖాస్తులపై మంగళవారం ఎస్టీయూ భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేవీలో చేరేందుకు ఓమంచి అవకాశం ఉందన్నారు. టెక్నికల్‌తో పాటు నాన్ టెక్నికల్ కోర్సుల్లో ఉద్యోగాలు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలి? ఏ విధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలో? అవగాహన కల్పిస్తున్నారన్నారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ భారత సైన్యంలో చేరి దేశ సేవ చేయాలన్నారు. నైపుణ్యాలను బట్టి ఉద్యోగాలు ఉన్నాయని, వాటి గురించి తెలుసుకోవాలన్నారు. భారత వాయుసేనలో అగ్నివీర్ వాయుగా చేరేందుకు 2005 జనవరి 1 నుంచి 2008 జులై 1 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. అంతకుముందు రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో జిల్లా సైనిక సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, సెంటర్ సెంటర్ సెర్జియంట్ ఎస్‌డీ జిట్, కార్పొరల్ ఎన్.సందీప్, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శంకర్ దాస్, డాక్టర్ మేజర్ కరుణకర్, కెప్టెన్ మజర్ హుస్సేన్, న్యాయవాది విశ్వనాథ్, ఎంఈఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● డీఈవోను పరామర్శించిన కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ విద్యా శాఖాధికారి ప్రణీతకు గుండెపోటు వచ్చిన నేపథ్యంలో ఆమె ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం ఆమెను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి డీఈవో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్ నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఉన్నారు.

దశల వారీగా గ్రామాల అభివృద్ధి

● బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో దశల వారీగా గ్రామాలను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నాగపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన గ్రామ పంచాయతీ భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటా్డుతూ నియోజక వర్గంలో అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులు చేపడుతామని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని జగదాంబ దేవి సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను గ్రామ మహిళలు ఘనంగా స్వాగతించారు. సమస్యలను తమకు వివరించాలని మహిళలకు సూచించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ రమణ గౌడ్, డాక్టర్ స్వామితో పాటు పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



నాగపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

● బాబా చూపిన మార్గంలో నడుచుకోవాలి

తలమడుగు: సద్గురు నారాయణ బాబా చూపిన సన్మార్గంలో ప్రతీ ఒక్కరూ నడుచుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో తలమడుగు మండలం పల్సి (బి) తాండాలో గల సద్గురువు నారాయణ బాబా 29వ అఖండ హరినామ మహోత్సవ యజ్ఞ కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక మార్గం వైపు నడిపించేందుకు బాబా ఎంతో కృషి చేశారన్నారు. మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఆలయాన్ని ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అదేవిధంగా ఈనెల 12 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న అఖండ హరినామ యజ్ఞ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణ బాబా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు జాదవ్ కిషన్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

● అఖండ హరినామ మహాయజ్ఞోత్సోవ ఆహ్వానం

నేరడిగొండ: అఖండ హరినామ మహా యజ్ఞోత్సవ ఆహ్వాన పత్రికను మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు, అలాగే బోథ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్‌కి 29వ అఖండ హరినామ మహా యజ్ఞోత్సవ ఆహ్వానం పత్రికను సంస్థాన అధ్యక్షుడు జాదవ్‌కిషన్ మంగళవారం అందజేశారు. సంత్‌శ్రీ సద్గురు నారాయణ గారి 29వ అఖండ హరినామ మహా యజ్ఞోత్సవంలో తప్పకుండా హాజరు కావాలని కోరగా.. వస్తామని వారిరువురు పేర్కొన్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఎంసీ ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు మౌలాన, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు దుప్పట్లను అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

కలెక్టర్‌ను కలిసిన జిల్లా దళిత సంఘాల నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా దళిత సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రాజార్షిషాని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిరుపేదలకు పంచేందు కోసం దుప్పట్లను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఇందులో బాబుజగ్జీవన్‌రామ్ సంఘం అధ్యక్షులు మల్యాల స్వామి, తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాలల మనోజ్, తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా ఇన్‌చార్జి మోతేబారిక్‌రావు, కులం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరావు, అంబేద్కర్ సంఘం నాయకులు వసంత్ పవర్, నాయకులు సిందే సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల హక్కుల కోసం ప్యార లీగల్ వలంటీర్లు కృషి : ప్రభాకర్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): చిన్నారుల హక్కులతో పాటు వారికి ధైర్యం చెప్పాడానికి ప్యార లీగల్ వలంటీర్లు పని చేస్తారని జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ అన్నారు. మంగళవారం డీఎల్ఎస్ఏ కార్యాలయ సమావేశ మందిరంలో ప్యార లీగల్ వలంటీర్ల రెండు శిక్షణ సదస్సును ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా ప్యార లీగల్ వలంటీర్ల పని గురించి తెలిపారు. వచ్చిన కేసుల్లో వారిని న్యాయం జరిగేలా వలంటీర్లు అవగాహన కల్పించడం తోపాటు న్యాయ సాయం అందించాలన్నారు. చిన్నారులపై అనేక అఘాయిత్యాలు జరుగుతున్నాయని అవి బయటకు రావడం లేదని జిల్లా న్యాయాధికారి ప్రభాకర్ అన్నారు. కోర్టుల్లో వచ్చిన కేసుల్లో వారిని న్యాయం జరిగేలా ప్యార లీగల్ వలంటీర్లు అవగాహన కల్పించడంతోపాటు న్యాయ సాయం అందించాలన్నారు. చిన్నారుల హక్కులు, చట్టాలు తదితర అంశాలపై రెండు రోజుల పాటు జరిగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శివరాం ప్రసాద్, హుస్సేన్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం : దేవేందర్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ ఆరోపించారు. మంగళవారం ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వంలో మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిర్ర దేవేందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు గౌరవ వేతనం కనీసం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీలకు సొంత భవనాలు కట్టి అద్దె, గ్యాస్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో శిశు సంక్షేమ శాఖ మంత్రి అంగన్‌వాడీలకు రూ.18 వేల వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. నూతనంగా వచ్చిన ప్రజాపాలన అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోడం లేదన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి వేతనాలు పెంచడంతోపాటు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రకళ, ఛాయ, సంగీత, సుశీల, రుక్మిణి, జంగుబాయి, తదితరులు పాల్గొన్నారు.

'వారిపై చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్ రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి వర్గీయులు చింపివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నహిద్ అన్నారు. ఇది కాంగ్రెస్ సంస్కృతి కాదన్నారు. తమ ఫ్లెక్సీలను చింపివేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అధిష్టానాన్ని కోరారు. పోలీస్ స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టి.కపిల్, రవీందర్, ఆసిఫ్, ఆదిల్, రామకృష్ణ, అమృత్, తదితరులు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిలబడి హమాలీల నిరసన

ఉట్నూర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పౌర సరఫరాల గోదాం వద్ద సివిల్ సప్లయి హమాలీ కార్మికులు చేపట్టిన సమ్మె 7వ రోజుకు చేరుకుంది. మంగళవారం సమ్మెలో భాగంగా ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లయి హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టడం జరిగిందన్నరు. గతంతో సివిల్ సప్లయి కమిషనర్ కార్మికులతో ఒప్పుకున్న ప్రకారం జి ఓ విడుదల చేయక పోవడం శోచనీయం అన్నారు. పెరిగిన రెట్ల జీవో అమలు చేయకపోవడం వెనుక ఉన్న మతాలబు కార్మికులకు అర్థం కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలతో సహా ఒప్పంద జీవోను అమలు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించి, కార్మికులకు 10 లక్షల ఆరోగ్య బీమా కల్పించకాపోతే సమ్మె కొనసాగుతుందని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

ఇంద్రవెల్లి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తంను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇందులో బాబాసాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్, కోశాధికారి కాంబ్లే సునీల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరంజి శివారులో పులి సంచారం

● పెద్దపులి అడుగులని నిర్ధారించిన అటవీ శాఖ అధికారులు ● గాలింపు చర్యల్లో నిమగ్నమైన జైనథ్ పోలీసు అధికారులు


కరంజిలో పులి అడుగులను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు


గాలింపులో పాల్గొన్న పోలీసు అధికారులు

జైనథ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని కరంజి గ్రామ శివారుల్లో పెద్దపులి సంచారం జరుగుతుందని జిల్లా మండల అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. మంగళవారం పులి సంచారం అడుగులను అటవి శాఖ అధికారులు రాథోడ్ రాజేందర్, గులాబ్‌లు తెలిపారు. ఈ పులి మండల సరిహద్దున గల మహారాష్ట్రలోని దిగవన్ గ్రామం అవతలి పెన్‌గంగా నది నుంచి జైనథ్ మండలంలోని కరంజి గ్రామ శివారుల్లోకి వచ్చిందని తెలిపారు. పులి సంచారంపై జైనథ్, బేల మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు రైతు కూలీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పులి సంచారం తెలుసుకున్న జైనథ్ రూరల్ సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం పై కరంజి, కాప్రీ గ్రామాల్లో గాలింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ విజయ, ప్రశాంత్, ఏఎస్సై ఆత్మారాం, పారెస్టు పోలీసు శాఖ సిబ్బంది ఉన్నారు.

జూనియర్ కళాశాలో డీఐఈవో తనిఖీ

ఉట్నూర్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో రవీందర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ప్రతీ తరగతికి వెళ్లి విద్యార్థుల సిలబస్‌ను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులకు ప్రాక్టికల్స్, థియరీ ఎగ్జామ్స్ సంబంధించిన సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశల ప్రిన్సిపల్ ధనరాజ్, సూపరింటెండెంట్ మోసిన్, తదితరులు పాల్గొన్నారు.

'నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయండి'

బోథ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్డి(కె) గొల్లాపూర్, మామిడిగూడ, గొల్లపూర్ తండా గ్రామాలలో నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. అంతేగాక పరుపులపల్లి, టివిటి పల్లె గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని ఎంపీడీవో కోరారు. ఫలితంగా సోనాల మండలంలో మరో రెండు గ్రామపంచాయతీలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఇందులో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పశుల చంటి, లాలూ రామ్, తోడసం ముత్యం, దత్తు, తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

నేరడిగొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మంగళవారం మండల కేంద్రంలో రాష్ట్ర సీనియర్ నాయకులు, మండల ఇన్‌చార్జి గజ్జలశంకర్ మాదిగ అధ్యక్షతన మండల కమిటీ ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర సీనియర్ నాయకులు కుడాలస్వామి కాంబ్లె బాలాజి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిలో మండల అధ్యక్షుడిగా గజ్జల అశోక్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా చుంచు రవి మాదిగ, ప్రధాన కార్యదర్శిగా బిక్కి రాకేష్ మాదిగ, అధికార ప్రతినిధి గజ్జల సంతోష్ మాదిగ, కార్యదర్శిగా ఓడ్డేపల్లి సురేష్‌మాదిగ, సంయుక్త కార్యదర్శి చిర్రగంగాధర్‌మాదిగ, ప్రచార కార్యదర్శిగా జూలాఅడెల్లుమాదిగ, తదితరులు ఉన్నారు.

ఉప ముఖ్యమంత్రి హామీని నెరవేర్చాలి

నేరడిగొండ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరంలో చేసిన అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు నిధులు విడుదలకాక నానా అవస్థలు పడుతున్న మాజీ సర్పంచ్‌లు, సన్నకారు కాంట్రాక్టర్లు వడ్డీలు చెల్లించలేక అగమ్యగోచరమైన పరిస్థితులలో జీవనాన్ని నెట్టుకొస్తున్నారని గిరిజన లంబాడీల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్‌జాదవ్ అన్నారు. గత నెలలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క రూ.10 లక్షల లోపు ఉన్న పెండింగ్ బిల్లులన్ని ఇస్తానన్న హామీని త్వరలో నెరవేర్చాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చేసిన అప్పులకు నిధులు విడుదలయితే వారి జీవన పరిస్థితులు మెరుగవుతాయని ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి ఇచ్చిన హామీని నేరవేర్చాలని గత రెండేళ్ల పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటితినతఈ మంజూరు చేయాలని, లేదంటే చావే శరణ్యమని సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు ఆవేదన వెలుబుచ్చుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో లైవ్ జిల్లా ఇన్‌చార్జి పాండు, లైవ్ మండల బాధ్యులు భీమ్‌రావు, దేవిలాల్, పవన్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో నాయకుల ప్రత్యేక పూజలు

మావల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఏఐసీసీ ఇన్‌చార్జి శ్రీమతి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్ పెరుమాళ్, ప్రోటోకాల్ చైర్మన్ వేణుగోపాల్‌లు మంగళవారం జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మావలలోని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి నివాసంలో ఆయన ఆతిథ్యం మేరకు విచ్చేసిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లాలోని రాజకీయాలపై, సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విట్టల్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ మంత్రి వేణుగోపాల చారి, జిసిసి చైర్మన్ కొట్నాక తిరుపతి, ఆదిలాబాద్ పార్లమెంటు ఇంచార్జి ఆత్రం సుగుణక్క, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఆడే గజేందర్, కంది శ్రీనివాస్ రెడ్డి, శ్యామ్ నాయక్, తలమడుగు మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, సారంగాపూర్ మాజీ జడ్పీటీసీ పత్తి రాజేశ్వర్ రెడ్డి, ఏఐసీసీ మెంబర్ నరేష్ జాదవ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇసుక తవ్వకాలు

(5వ పేజీ తరువాయి...)

అధికారులు కూడా జంకుతున్నట్లు తెలుస్తుంది. వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. తమకెందుకులే అన్నట్లుగా కొందరు అధికారులు వ్యవహరించడంతోనే ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ తవ్వకాలపై మైనింగ్ మాఫియాను ప్రశ్నిస్తే అధికారులకు అడిగినంతా ఇచ్చే ఇసుకను తరలిస్తున్నామని బహిరంగంగా చెప్పడం విస్మయాన్ని కలిగిస్తోంది.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఉట్నూర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల పట్ల విద్యార్థులు యువకులు అప్రమత్తంగా ఉండాలని ఉట్నూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గండికోట మొగిలి అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో, పోలీసు వారి సౌజన్యంతో రోడ్డు భద్రత వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఉట్నూర్ సీఐ గండికోట మొగిలి మాట్లాడుతూ విద్యార్థులు, యువత రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై మనోహర్ విద్యార్థులకు ఉండాల్సిన లక్షణాల గురించి తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ధనరాజు పోలీసు వారి సమాజసేవని ఈ సందర్భంలో కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, సువర్ణ, శ్రీలత, గణేష్, వినోద్; ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మణ్, సుజాత, తిరుపతి, నవీన్, దశరథ్, కిసక్షర్, శివ ప్రసాద్, రూప, అధ్యాపకేతరులు మల్లేశం, ప్రకాష్, సాయికృష్ణ, సుగందబాయి, అజిత్‌ఖాన్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

హస్నాపూర్‌లో బూత్ కమిటీల ఎన్నికలు

ఉట్నూర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాపూర్‌లో మంగళవారం బీజేపీ బూత్ కమిటీల ఎన్నికలు నిర్వహించారు. 105, 106వ బూత్ కమిటీలు రాష్ట్ర నాయకులు రాథోడ్‌రితేష్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.నియోజక వర్గంలోని అన్ని బూత్ కమిటీల ఎన్నికలు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, తన్నీరు సతీష్, మండల ప్రధాన కార్యదర్శి బింగి వెంకటేశ్, కిషన్, మహేందర్, కైలాస్‌గావులే అమర్‌నాథ, రాథోడ్ దీపక్, రాథోడ్ విఠల్, గ్రామ నాయకులు తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా.. ఒకరి మృతి

బజార్‌హత్నూర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలం పరిదిలోని దేగామ గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడి గిర్నూర్ గ్రామానికి చెందిన మైలారపు అడెల్ల(35) అనే మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం వివరాలిలాల ఉన్నాయి.. గిర్నూర్ గ్రామానికి చెందిన వారు దేగామ గ్రామంలోని అడెల్లి పోచమ్మతల్లి ఆలయం వద్ద పండుగను నిర్వహించుకుని తిరుగు ప్రయాణంలో దేగామ గ్రామ సమీపంలో మూల మలుపు వద్ద ఆటో అదుపుతప్పి గోతిలో పడి పోయిందని అందులో ప్రయాణిస్తున్న మహిళ మైలారపు అడెల్లా అక్కడికక్కడే మృతి చెందిందని ఆయన తెలిపారు. వారితో పాటు ప్రయాణిస్తున్న అరుణ్(23)కు తీవ్ర గాయాలవ్వడంతో ప్రాణాపాయ స్థితిలో ఉండడంతో మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. పలువురికి గాయాలవ్వడంతో స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు ఆయన తెలిపారు.

ప్రమాదవశాత్తు కూలి మృతి

బోథ్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్వప్న జిన్నింగ్ ఫ్యాక్టరీలో మంగళవారం మధ్యాహ్నం పత్తి ఘటాన్‌లను లోడింగ్ చేస్తుండగా అందులో పని చేస్తున్న కూలీ పక్కన పడి గాయాలు కావడంతో శాంతారామ్ (55) అనే కూలీ మృతి చెందాడు. వివరాలిల ఉన్నాయి.. అయితే, ఈ సంఘటన జరిగిన వెంటనే కూలీని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స ప్రారంభించే సమయానికి ముందే మృతి చెందాడని ఎస్సై ఎల్ ప్రవీణ్ తెలిపారు. దీంతో మృడి కుటుంబీకులకు సమాచారం అందించడంతో మధ్యాహ్నం కుటుంబీకులు రావడం జరిగింది. దీంతో మృతుడి భార్య నీలాబాయి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వినోదాత్మక విద్యకు ఉపకరణాల పంపిణీ


ప్రధానోపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత డీఈవో ఆఫీస్ నందు సమగ్రశిక్ష క్రింద నూతన విద్యా విధానంలో భాగంగా ఐఐటీ గాంధీనగర్ ద్వారా మంజూరు అయిన ఎఫ్ఎల్ఎన్ బాక్స్‌లను ఎంపికయిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేసినట్లు జిల్లా విద్యాధికారి రామారావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇందులో ప్రాథమిక, ప్రాథమికోన్నత తరగతుల విద్యార్థులకు ఉపయోగపడే 25 రకాల వస్తువులు ఉన్నాయని వీటి ద్వారా విద్యార్థులు ఆటలతో విద్యను వినోదాత్మకంగా నేర్చుకోవడానికి వీలు కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, విద్యాశాఖ సమన్వయకర్త నర్సయ్య, జిల్లా పరీక్షల సహాయ సెక్రటరీ భానుమూర్తి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాలను పరిశీలించిన అధికారులు

తానూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం తానూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా ఇంటర్ మాధ్యమిక విద్యాధికారి జే. పరుశురాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో సిలబస్ గురించి సబ్జెక్టు నోట్స్‌లను పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు వచ్చి హాజరుశాతం పెంచేలా చూడాలని అధ్యాపకులకు సూచించారు. 90 రోజుల ప్రణాళికలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఈయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ ఫణీ రాజశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సరస్వతీ శిశు మందిర్‌లో ఆహార ఉత్సవం

ముథోల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి ఇళ్లల్లో తయారు చేసిన రకరకాల ఆహార పదార్థాలను తీసుకువచ్చి ప్రదర్శించారు. తెచ్చిన వాటిలో ఏవి ఏ రకానికి చెందినవో వివరించారు. అనంతరం విద్యార్థులు తీసుకువచ్చిన ఆహారపదార్థాలను తోటి విద్యార్థులతో పంచుకుని ఆనందంగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమితి కార్యదర్శి ధర్మపురి సుదర్శన్, పాఠశాల అధ్యక్షులు కే. సంజీవ్, పాఠశాల సహ కార్యదర్శి వేదపాఠక్ నిశికాంత్, ప్రధానాచార్యులు సారధి రాజు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైయిర్ మేళాలో ప్రశంసలందుకున్న విద్యార్థి

కుబీర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల మండలం పోలేపల్లిలోని ఎస్‌వీకేఎం ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరుగుతున్న ఇన్‌స్పయిర్ మేళలో మండలంలోని గొడ్సారా విద్యార్థిని సిద్ధంవార్ గాయత్రి తన ప్రాజెక్టుతో ప్రశంశలను పొందించి. ఈ ఇన్‌స్పయిర్ మేళకు ఎంపికయిన విద్యార్థి సిద్ధంవార్ గాయత్రి క్లాప్ బేస్డ్ ఫ్యాన్ ఆన్ లేదా ఆఫ్ సిస్టమ్‌ను ప్రాజెక్టుగా ఎంచుకొని మేళాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వృద్దులు , వికలాంగులకు ఎంతగానో ఉపయోగపడే ఈ ప్రాజెక్టు ద్వారా విద్యుత్ కూడా ఆదా అవుతుందని విద్యార్థి తెలిపింది. విద్యార్థినిని జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, స్థానిక ఎమ్మెల్యే వాకిట శ్రీహరి అభినందించారు. ఇలాంటి ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడతాయని వారు తెలిపారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠినచర్యలు

నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : చైనా మాంజా వాడడం వలన ప్రజలకు, జంతువులకు ప్రాణా పాయం వాటిల్లే ప్రమాదం ఉందని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అన్నారు. రాబోయే సంక్రాంతి పండుగ సందర్భంగా చైనా మాంజా ఎక్కువగా విక్రయించే దుకాణాలపై అధికారులు తనిఖీ నిర్వహిస్తామని, నైలాన్ సింథటిక్ దారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. విక్రయించిన మాంజాతో ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే విక్రయదారులు కూడా అట్టి కేసుకు బాధ్యత వహించాల్సి ఉంటుందని, ఎవరైనా ఈ సూచనలకు విరుద్ధంగా చైనా మాంజా నిల్వ చేసిన, అమ్మిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.



నిర్మల్ జిల్లా కేంద్రంలోని దుకాణాలలో తనిఖీలు చేస్తున్న పోలీసు అధికారులు

వినియోగంతో తలెత్తే ప్రమాదాల నివారణకు ప్రజలందరూ బాధ్యతగా భావించి సహకరించాలన్నారు. నిషేదిత చైనా మాంజా విక్రయాల నియంత్రించేందుకు పోలీసుశాఖ తగు చర్యలు చేపట్టిందన్నారు. పోలీసు శాఖ ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా చైనా మాంజాను విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు.

భైంసా డివిజన్‌లో తనిఖీలు


విక్రయ కేంద్రాల్లో తనిఖీ చేస్తున్న భైంసా టౌన్ సీఐ గోపినాథ్

భైంసా, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నిషేదిత చైనా మాంజాను విక్రయించిన, వినియోగించిన చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని భైంసా టౌన్ సీఐ గోపినాథ్ హెచ్చరించారు. మంగళవారం భైంసా పట్టణ పరిధిలోని గాలిపటాలు, మాంజా విక్రయించే దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో టౌన్ సీఐ గోపినాథ్ మాట్లాడుతూ నైలాన్ , సింథటిక్ దారాలతో తయారు చేసే చైనా మాంజాలతో పర్యావరణానికి హాని ఉందన్నారు. ఎన్నో పక్షులు , ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు. గాలి పటాల ఎగురవేతల్లో చైనా మాంజా తెగి కిందకి వచ్చే సమయాల్లో రోడ్ల మీదుగా వెలుతున్న దిచక్ర వాహన చోదకుల మెడకు చుట్టుకొని తీవ్ర రక్తస్రావాలు జరిగి ప్రాణాపాయ పరిస్థితులు నెలకొంటున్నాయని వివరించారు. మృతి చెందిన సంఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు. సంక్రాంతి పర్వదిన వేడుకల్లో భాగంగా గాలి పటాలు ఎగురవేసే వారు చైనా మాంజా వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. చైనా మాంజా

బాసరలో..

బాసర, జనవరి, 7: (ఆంధ్రజ్యోతి) : బాసర మండల కేంద్రంలో పతంగులను విక్రయించే దుకాణాల్లో మంగళవారం స్థానిక పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పతంగులు విక్రయాలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో నిషేధిత చైనా మాంజా విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు తనిఖీలు చేపట్టారు మంగళవారం మండల కేంద్రంలోని ప్రతి దుకాణాన్ని తనిఖీ ఏశారు. చైనా మాంజా వినియోగం దాని దుష్పరిణామాల గురించి దుకాణదారులకు పోలీసులు వివరించారు. విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎక్కడైనా చైనా మాంజా గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని లేదంటే డయల్ 100 కు ఫోన్ చేసి తెలుపాలని విజ్ఞప్తి చేశారు. బాసర ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో పోలీసుల తనిఖీలు కొనసాగాయి. పండుగ ముగిసే వరకు ఈ తనిఖీలు నిర్వహిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

మామడలో..

మామడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గాలి పటాలకు నిషేధిత చైనా మాంజాను అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని మామడ ఎస్సై సందీప్ అన్నారు. మంగళవారం మామడ మండల కేంద్రంలోని కిరాణా దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చైనా మాంజా ఉపయోగించడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు చైనా మాంజాను ఉపయోగించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, దుకాణా యజమానులు ఉన్నారు.

లోకేశ్వరంలో..

లోకేశ్వరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండగ వచ్చిందంటే గాలిపటాలతో చిన్న పిల్లలు చిందులు వేస్తూ గాలిపటాలను ఎగురవేస్తూ ఉంటారు. ఈ గాలిపటాలకు మాంజాతో పాటు చైనా మాంజాను వాడుతూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఈ చైనా మాంజాను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించినీ ఈ గాలిపటాలు అమ్మేవారు సైతం చాటు మార్గాన పిల్లలకు అమ్ముతూ మనుషులతో పాటు పక్షుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కావునా చైనా మాంజా వాడవద్దన్నారు. చైనా మాంజాను అమ్మిన, నిల్వ చేసిన, రవాణా చేసిన చట్ట ప్రకారం శిక్షలు తప్పవని లోకేశ్వరం ఎస్సై జి. అశోక్ హెచ్చరించారు. చైనా మాంజా వాడకం వల్ల కలిగే అనర్థాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర పర్యావరణ చట్టం (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్-2016) ప్రకారం చైనా మాంజా వాడకాన్ని నిషేధించినట్లు తెలిపారు. చైనా దారం అమ్మకం గురించిన వివరాలు తెలిస్తే 8712659541 నెంబర్‌కు తెలపాలని కోరారు. మంగళవారం ఎస్సై జి. అశోక్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా మండలంలోని షాపులలో, గాలి పటాలు అమ్మే షాపులలో తనిఖీలు నిర్వహించడం జరిగింది. చైనా మాంజా గురించి స్కూల్ పిల్లలకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

సోన్ మండల కేంద్రంలో..

సోన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండల కేంద్రంలో ఆయా కిరాణా షాపులను సోన్ సీఐ కే. నవీన్ కుమార్ తనిఖీ చేశారు. గాలిపటాలకు చైనా మాంజాను వాడకూడదని, కిరాణా షాపుల్లో చైనా మాంజాను విక్రయించకూడదన్నారు. వాటి వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఒకవేళ అలాంటి వాటిని విక్రయిస్తే షాపు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కుబీర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చాణక్య సంస్కృతి పాఠశాల విద్యార్థులు కరాటేలో ప్రతిభ కనబరిచినట్లు డైరెక్టర్ సతీష్ తెలిపారు. శనివారం జపాన్ కరాటే అసోసియేషన్ స్టేట్ చీఫ్ ఎగ్జామినర్ సెన్సై తేజేందర్ సింగ్ భాటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కారటే బేల్ట్ గ్రేడింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు 10మంది రెడ్‌బెల్ట్ సాధించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఏకరూప దుస్తులు

ముథోల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు యూనిఫామ్ అందిస్తున్న రాష్ట్ర సర్కార్ తాజాగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు సైతం ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే యూనిఫామ్ పంపిణీకి ఐసీడీఎస్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ముథోల్ ఐసీడీఎస్ పరిధిలో ముథోల్, బాసర, తానూర్, లోకేశ్వరం మండలాలకు గాను 180 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి.

ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన పోలీసులు



నిర్మల్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని తల్వేద ఎక్స్ రోడ్డు వద్ద ప్రజలకు రోడ్డు భద్రతపై రూరల్ సీఐ రామకృష్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రాణాలను కాపాడుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లింబాద్రి, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించండి

లక్ష్మణచాంద, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ రూల్స్ పాటించి భద్రంగా ఉండాలని ఎస్సై సుమలత మంగళవారం అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో మండల కేంద్రమైన లక్ష్మణచాంద గ్రామంలోని వాహనదారులకు, గ్రామ ప్రజలకు రోడ్డు భద్రత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాలపై ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మద్యపానం సేవించి వాహనం నడపకూడదన్నారు. ట్రాఫిక్ రూల్స్ గురించి అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా రోడ్డు సేఫ్టీ గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సోన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామంలోని ఐబీ వద్ద సోన్ సీఐ కే.నవీన్‌కుమార్ ఎస్సై కే. గోపి, పోలీస్ సిబ్బందితో రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన ప్రోగ్రాం నిర్వహించడం జరింది. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగంగా నిర్లక్ష్యంగా వాహనాలను నడపకూడదన్నారు. తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని, అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు.

సమ్మెను విరమించిన సమగ్రశిక్ష ఉద్యోగులు

నిర్మల్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు గత 29 రోజులుగా పోరాటం చేసిన సమగ్రశిక్ష ఉద్యోగులు మంగళవారం సమ్మెను తాత్కాలికంగా విరమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూడు నెలల్లో తమ డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు చెప్పారు.

విధుల్లో చేరిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

లోకేశ్వరం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని రోజులుగా సమ్మె బాట పట్టిన లోకేశ్వరం మండలం ఎస్ఎస్ఏ ఉద్యోగులు కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్, ఎంఆర్‌సీలో పని చేసే ఎంఐఎస్ కోఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్, మెసెంజర్, స్కూల్ కాంప్లెక్స్‌లో పని చేసే సీఆర్‌పీలు, ఐఆర్‌పీలు, పీటీఐలు, కేర్ గీవర్ అందరూ మంగళవారం విధుల్లో చేరారు.

ఫటా..ఫట్...

రోడ్డుప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన సదస్సులు

● బెల్‌తరోడా (భైంసా) ఆర్‌టీఏ చెక్‌పోస్టు ఎంవీఐ దూప్‌సింగ్



భైంసా, జనవరి7(ఆంధ్రజ్యోతి): రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగం గా ప్రమాదాల నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని బెల్‌తరోడా (భైంసా) ఆర్‌టీఏ చెక్‌పోస్ట్ ఎంవీఐ దూప్‌సింగ్ తెలిపారు. చోదకులు, వాహనదారులు, విద్యార్థులు, పాదాచారులు రోడ్డుప్రమాదాలు, రవాణాశాఖ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ సందర్భంగా పలు అంశాలపై వివరించారు.

ఆంధ్రజ్యోతి: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటీ?

ఎంవీఐ: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈనెల చివరివరకు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు కొనసాగిస్తాం. ప్రమాద నివారణచర్యలపై అవగాహన కల్పిస్తున్నాం. బ్యానర్లు, వాల్‌పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారంచేస్తున్నాం. లారీలు, టిప్పర్లు, ఆటోలు, ట్రాక్టర్‌డ్రైవర్లు, కళాశాలలు, పాఠశాలల సంస్థలు, ఆర్టీసీ వంటి సంస్థల్లో ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వాహనదారులకు మీరిచ్చే సూచనలు?

ఎంవీఐ: వాహనదారులు రవాణాశాఖ నిబంధనలు తెలుసుకోవాలి. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి. ఇది తలకు గాయాలు కాకుండా నివారిస్తుంది. కారులో ప్రయాణిస్తున్నప్పుడు సీట్‌బెల్టును తప్పనసరిగా ధరించాలి. దీనిద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చు. సీట్‌బెల్టు ధరిస్తేనే సేఫ్టీఎయిర్ బ్యాగ్స్ ఉపయోగపడుతాయి. వేగ పరిమితులను పాటించడం ద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చు. మద్యం తాగి, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడుపొద్దు. వాహనాలు నడిపే సమయంలో పాదాచారులకు ప్రాధాన్యమివ్వాలి. వాహనం స్టార్ట్ చేసే ముందు చుట్టూ పరిశీలించాలి.

ఆంధ్రజ్యోతి: డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఎలా దరఖాస్తు చేయాలి?

ఎంవీఐ: రవాణాశాఖ నిబంధనల ప్రకారం 18 ఏళ్ల నిండినవారు ముందుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వారికి ముందుగా లెర్నింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. ఆ తరువాత మళ్లీ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే పూర్తి స్థాయి లైసెన్స్ అందజేస్తారు.

ఆంధ్రజ్యోతి: రవాణాశాఖలో ఎన్నిసేవలు అందుబాటులో ఉన్నాయి?

ఎంవీఐ: రవాణా శాఖలో 56రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించి 11, రిజిస్ట్రేషన్లకు సంబంధించి 7, పర్మిట్లకు సంబంధించి 4 సేవలు పొందవచ్చు.

ఆంధ్రజ్యోతి: వాహనాల రిజిస్ట్రేషన్ ఏ విధంగా చేసుకోవచ్చు?

ఎంవీఐ: వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుంది. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించడంతోపాటు వాహనాలను కార్యాలయానికి తెచ్చిన తర్వాతే పరిశీలించి రిజిస్ట్రేషన్ చేస్తారు.

ఆంధ్రజ్యోతి: ఓవర్‌లోడ్‌పై తీసుకుంటున్న చర్యలు?

ఎంవీఐ: ఓవర్‌లోడ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు మార్గాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపడుతున్నాం. ఓవర్‌లోడ్‌తో సరుకులను తరలిస్తున్న వాహనాలపై కేసులునమోదు చేస్తున్నాం. ఆర్‌టీఏ నిబంధనలకు అనుగుణంగా ఓవర్ లోడ్‌కు జరిమానా విధిస్తున్నాం.

పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి: సబ్‌కలెక్టర్

ఇంద్రవెల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకం ద్వారా రాయితీపై మంజూరు చేస్తున్న సోలార్ విద్యుత్‌ను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో బాలాజీ సోలార్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ముందుగా బాలాజీ సోలార్ ఏజెన్సీ నిర్వాహకులు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాటాలడారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల విలువగల సోలార్ విద్యుత్ ప్లేట్‌లను రాయితీపై కేవలం రూ.78 వేలకు మంజూరు చేస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు బాలాజీ సోలార్ ఏజెన్సీకి సంప్రదించి దరఖాస్తు చేస్తే సోలార్ సిస్టమను ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్ అందిస్తామని వెల్లడించారు. ఇప్పటికైనా ముత్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో 81 కుటుంబాలను అధికారులు గుర్తించారని, త్వరలో సోలార్ విద్యుత్ సిస్టమ్‌ను అమర్చుతారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, గ్రామ పంచాయితీ కార్యదర్శి విజయ్‌కుమార్, విద్యుత్ శాఖ ఏఈ రోహిదాస్ తదితరులు ఉన్నారు.



నేడు టీపీసీసీ అధ్యక్షుడిగా వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న మహేశ్‌కుమార్ గౌడ్

స్వామివారి సేవలో మహేశ్‌కుమార్‌గౌడ్

పార్లమెంట్ ఎన్నికల కంటే ముందు 2024 ఫిబ్రవరి 3న టీపీసీసీ వర్కింగ్‌ప్రెసిడెంట్, ఎమ్మెల్సీహోదాలో ఆదిలాబాద్‌కు వచ్చిన మహేష్ కుమార్ గౌడ్ ఎంతో ప్రాశస్త్యం కలిగిన స్థానిక మార్వాడి ధర్మశాలలో గల వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించగా ఆ హోదాలో ఈనెల 6న మొదటిసారిగా జిల్లా పర్యటన విచ్చేసిన ఆయన అదే సెంటిమెంట్‌తో మళ్లీ ఏఐసీసీ పెద్దలతో కలిసి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. వారికి ఆలయ పూజారి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తీర్థప్రసాదాలు అందజేసి దీవించారు.

● (ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



ఎమ్మెల్సీ హోదాలో 2024 ఫిబ్రవరి 3న వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న మహేశ్‌కుమార్ గౌడ్

నాటి నవాబులు నిర్మించారు..

నేటి పాలకులు విస్మరించారు!

● నిర్వహణ లేక శిథిల దశకు భవనాలు ● ఉట్నూర్‌లో అన్యాక్రాంతం అవుతున్న రోడ్లు భవనాల శాఖ స్థలాలు ● పట్టించుకోని అధికారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన



ఉట్నూర్‌లో దొంగల పాలైన కిటికీలు, తలుపులు




ఉట్నూర్‌లో పొదల మధ్య ఉన్న డైనింగ్ హాల్



గుడిహత్నూర్‌లో శిథిలమైన ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం

ఉట్నూర్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ ప్రభుత్వం అనంతరం వచ్చిన నిజాం నవాబుల పరిపాలనలో నిర్మించిన విశ్రాంతి గృహాలు శిథిల దశకు చేరడంతో రోడ్లు భవనాల శాఖ స్థలాలు సైతం ఆక్రమణకు గురి అవుతున్నాయి. ఉట్నూరు పట్టణంలోని నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న రోడ్లు భవనాల శాఖ విశ్రాంతి గృహం దశాబ్దం క్రితం అగ్ని ప్రమాదానికి గురికావడంతో ఆ రోజు నుంచి ఈరోజు వరకు పట్టించుకునే అధికారులు కనబడడం లేదని పరిశీలకులు అంటున్నారు. ఉట్నూర్ విశ్రాంతి భవనంలో రెండు సూట్లు ఉండగా సిబ్బంది కోసం కూడా రెండు భవనాలు 50 ఏళ్ల కిందనే నిర్మించారు. విశ్రాంతి భవనానికి వచ్చిన వారికి పనులు చేసి ఇద్దరు సిబ్బందితోపాటు వంటగదిని కూడా ఏర్పాటు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రులు ఎన్‌టీ రామారావు, చంద్రబాబునాయుడు సైతం ఈ ప్రాంత పర్యటనకు వచ్చినప్పుడు ఈ విశ్రాంతి గృహంలోనే ఉన్నారు. గవర్నర్లు కేసీ అబ్రహం, కుమిద్ బిన్ జోషిలతోపాలు ఎందరో మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు ఈ విశ్రాంతి భవనంలో నివాసం ఉండేవారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఈ విశ్రాంతి భవనం స్థానంలో కొత్త భవనం నిర్మించాలని భావించిన అది కార్యరూపం దాల్చలేదు. 2014లో అనూహ్యంగా జరిగిన అగ్ని ప్రమాదంలో విశ్రాంతి భవనం పూర్తిగా దగ్ధం కావడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడంతో మిగిలిన శిథిలాల నుంచి కిటికీలు తలుపులు, దొంగలు అపహరించుకుపోయారు. పక్కనే ఉన్న మరో భవనం కిటికీలు తలుపులు సైతం దొంగలించారు. సిబ్బంది గృహాలు సైతం ముళ్లపొదలతోనుంచి శిథిలమవుతున్నాయి. 2018లో విశ్రాంతి భవనం కొత్తది నిర్మించాలని ప్రభుత్వం భావించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. రెండో సారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం భవన నిర్మాణం ఊసెత్తలేదు. కొమరంభీం ప్రాంగణంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో పీఎంఆర్సీ భవనం ఉన్నందున ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో ప్రత్యేక భవనం అవసరం లేదని అధికారులు భావించారు.



దగ్ధమైన ఉట్నూర్‌లోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి గృహం.

● 20 నుంచి 35 కిలో మీటర్లకు ఒక విశ్రాంతి భవనం

నిజాం రాజుల పరిపాలనలో అప్పటి అధికారులు, పర్యటనలకు వెళ్లినప్పుడు విశ్రాంతి తీసుకునేలా ప్రతీ 20 నుంచి 35 కిలో మీటర్ల లోపు విశ్రాంతి భవనాలు నిర్మించారు. ఉట్నూరులో నిర్మించిన విశ్రాంతి భవనం నుంచి కరెక్టుగా మంచిర్యాల వైపు ఇంధనపల్లిలో, ఆదిలాబాద్ వైపు గుడిహత్నూర్లో విశ్రాంతి నిర్మించారు. అదే మాదిరి 20 కిలో మీటర్లలోపు ఇచ్చోడ, నేరడిగొండ, వాంకిడి, నిర్మల్, సోన్ వరకు విశ్రాంతి భవనాలు నిర్మించగా శిథిలదశకు చేరుకున్నాయి. కేవలం నిర్మల్ జిల్లా కేంద్రంలోని విశ్రాంతి భవనానికి మరమ్మతులు చేసిన అధికారులు మిగతా విశ్రాంతి భవనాల గురించి పట్టించుకోకపోవడంతో పూర్తిగా చెడిపోయాయి. భవనాల ప్రాంతంలో ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలాలు పూర్తిగా ఆక్రమణకు గురవుతున్నా అధికారులు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వ భూములు కాపాడు కొని కొత్త భవనాలు నిర్మించాలని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సుల కోసం

పెరుగుతున్న విజ్ఞప్తులు

జర దేఖో!!



● కొత్తగా ఆరు రూట్లలో బస్సు సర్వీసులు ప్రారంభం

● ఇందులో రెండు అంతర్‌రాష్ట్ర సర్వీసులు ● మహాలక్ష్మీ పథకంతో అధికమవుతున్న డిమాండ్లు

భైంసా, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకంతో డివిజన్ పరిధిలోని వివిధ రూట్లలలో ఆర్టీసీ బస్సుల కోసం విజ్ఞప్తులు పెరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లోని ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు భైంసా డిపో కార్యాలయానికి తరలివచ్చి తమ రూట్‌లలో బస్సులను ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆయా రూట్లలోని రోడ్ల పరిస్థితులు, ప్రయాణికుల రాకపోకలపై సర్వే చేపడుతున్న ఆర్టీసీ అధికారులు అన్ని అనుకూలంగా ఉన్నట్లుగా తేలితే సంబంధిత రూట్లలో బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నారు.



బస్సు ట్రిప్పుల సంఖ్య పెంపు విషయంలో డిపోమేనేజర్ హరిప్రసాద్‌కు వినతిపత్రం అందచేస్తున్న విఠాపూర్ గ్రామస్థులు

● 6 రూట్లలో బస్సు సర్వీసులు ప్రారంభం

డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలకు బస్సు సర్వీసులు ప్రారంభించాలని వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఆర్టీసీ అధికారులు 6రూట్లలో బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఇందులో రెండు అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసులు ఉన్నాయి. వివిధ కారణాలతో ఇదివరకు రద్దు చేసిన రూట్లలో సైతం బస్సులు పునరుద్ధరించబడుతున్నాయి. తాజాగా భైంసా బస్సుడిపో అధికారులు తానూర్ మండలంలోని మహాలింగి, కుంటాల మండలంలోని విఠాపూర్, లోకేశ్వరం మండలంలోని పిప్రి గ్రామాలకు రెండేసీ ట్రిప్పుల చొప్పున బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఇక ముథోల్ మండలంలోని ఆష్ట గ్రామానికి ఇదివరకు రెండు ట్రిప్పులు మాత్రమే బస్సు సౌకర్యం ఉండగా అక్కడి ప్రాంత వాసుల విజ్ఞప్తుల మేరకు ట్రిప్పుల సంఖ్యను ఐదుకు పెంచారు. మంగళవారం కుంటాల మండలం విఠాపూర్ గ్రామస్తులు భైంసాకు తరలివచ్చి డిపోలో మేనేజర్ హరి ప్రసాద్‌ను కలిసి తమ గ్రామానికి అదనపు ట్రిప్పులను పెంచాలని వినతి పత్రం అందచేశారు.

● రెండు అంతర్ రాష్ట్ర సర్వీసులు

ప్రయాణీకుల విజ్ఞప్తులు, సౌలభ్యం కోసం గాను భైంసా నుంచి కొత్తగా రెండు రూట్లలో మహారాష్ట్రకు అంతర్ రాష్ట్ర బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఒక రూట్‌లో భైంసా నుంచి కీని, మరో రూట్‌లో భైంసా నుంచి నిగ్వా మీదుగా దివిషీ, బోకర్ వరకు బస్సు సర్వీసులను ఇక్కడి ఆర్‌టీసీ అధికారులు ప్రారంభించారు. సంబంధిత బస్సు సర్వీసుల ప్రారంభం ద్వారా మహారాష్ట్రకు సరిహద్దు ప్రాంతాలుగానున్న కుభీర్ మండల పరిధిలోని పలు గ్రామాల ప్రయాణీకులకు బస్సు వసతి కల్పించబడినట్లయ్యింది. పరిస్థితులకు అనుగుణంగా మరిన్ని రూట్లలో బస్సు సర్వీసులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లుగా భైంసా ఆర్‌టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

నేటితో ముగియనున్న మహా సాయి పారాయణం

● పురవీధుల గుండా సాయిపల్లకీ ఊరేగింపు ● హారతి అనంతరం అన్నప్రసాద వితరణ



మహిళా భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

నిర్మల్‌అర్బన్, జనవరి7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాస్త్రినగర్‌లో గల అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో గత ఆరు రోజులుగా కొనసాగుతున్న మహాసాయి పారాయణం కార్యక్రమం నేటి(బుధవారం)తో ముగియనున్నది. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్న ఈ పారాయణ కార్యక్రమంతో శాస్త్రినగర్‌తో పాటు చుట్టుపక్కల కాలనీల్లో పూర్తిగా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. షిర్డీ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన సాయిపల్లకి, సాయి పాదుకలను దర్శించుకునేందుకు భక్తులు వందలాదిగా తరలివస్తున్నారు. అలాగే షిర్డీ నుంచి వచ్చిన వికాస్ మహారాజ్ సాయిబాబా చరిత్రను, మహిమలను తెలియజేస్తుండడంతో భక్తులు మంత్రముగ్దులవుతున్నారు. మంగళవారం సాయి భక్తుడు కృష్ణ ప్రత్యేకంగా సాయిబాబా వేషధారణలో భక్తులకు దర్శనం ఇచ్చి కనువిందు చేశారు. బాబాకు ఎంతో ఇష్టమైన కిచిడి ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. కాగా పారాయణం చివరిరోజైన బుధవారం ఉదయం పట్టణ పురవీధుల గుండా సాయి పిల్లకి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని మహాసాయి పారాయణ నిర్వాహకులు, సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. అలాగే పారాయణ ప్రాంగణంలో మధ్యాహ్నా హారతి అనంతరం పెద్ద సంఖ్యలో హాజరయ్యే భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయికృపకు పాత్రులు కావాలని కోరారు.

కొనసాగుతున్న కేస్లాపూర్ నాగోబా ప్రచారరథం

ఇంద్రవెల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతరకు పుష్యమాస అమావాస్యను పురస్కరించుకొని ఈ నెల 28న మెస్రం వంశీయుల మహాపూజలతో నాగోబా జాతర ప్రారంభించనున్నారు. అందులో భాగంగా మెస్రం వంశీయులు ఈనెల 3న మెస్రం వంశీయులు (కటోడ) మెస్రం కోసేరావు, ప్రధాన్‌మెస్రం దాదారావుల ఆధ్వర్యంలో ప్రారంభమైన నాగోబా జాతర ప్రచార రథం యాత్ర సోమవారం రాత్రి మండలంలోని గిన్నెరా గ్రామంలో బస చేసి మంగళవారం ఉట్నూర్ మండలంలోని సాలేవాడ గ్రామానికి బయలుదేరింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 3న కేస్లాపూర్ నుంచి ప్రారంభమైన ప్రచార రథం సిరికొండ మండలానికి చేరుకొని గుగ్గిల స్వామి ఇంటికి వెళ్లి పూజకు అవసరమయ్యే కుండల తయారీకి ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. బుధవారం ఇంద్రవెల్లి మండలం వడ్‌గాం, గురువారం వడ్‌గాం నుంచి మడావి ఇంటి వద్ద రాత్రి బస చేస్తారని తెలిపారు. ఈనెల 10 కేస్లాపూర్ గ్రామంలోని పురాతన నాగోబా ఆలయం(మురాడి)లో ప్రత్యేక పూజలు చేసి పవిత్రమైన గంగాజలం సేకరించడానికి పాదయాత్రగా హస్తినమడుగుకు బయలుదేరనున్నారు.



కొనసాగుతున్న కేస్లాపూర్ నాగోబా ప్రచారరథం

మహిళలే మహారాణులు

● నిర్మల్ జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం




భైంసా, జనవరి7 (ఆంధ్రజ్యోతి): సవరించిన ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం జిల్లాలో 7,47,644 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,59,393 మంది ఉండగా మహిళలు 3,87,227 ట్రాన్స్‌జెండర్లు 52 సర్వీసు ఓటర్లు 972 మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే 27,834 మంది మహిళాఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఎన్నికల సంఘం ఏటా ఎస్ఎస్ఆర్ ఓటర్ల జాబితాను విడుదల చేస్తుంది. జాబితాలో తప్పొప్పులను, సవరణలు, తొలగింపులు, కొత్త ఓటర్ల పరిశీలన అనంతరం సంబంధిత ఓటరు జాబితాను సోమవారం విడుదల చేశారు.

● మూడు నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే ఆధిక్యం

సవరించిన ఓటరు జాబితా ప్రకారం జిల్లా పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. సోమవారం విడుదలైన ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజక వర్గాల పరిధిలో మొత్తం 7,47,644 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,59,393 మంది, మహిళలు 3,87,227 మంది, ట్రాన్స్‌జెండర్లు 52 మంది, సర్వీసుఓటర్లు 972మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 27,834 మంది అధికంగా ఉన్నారు. ఇక నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే ముథోల్ నియోజకవర్గ పరిధిలో 2,58,406 మంది ఓటర్లు ఉండగా ఇక్కడ మహిళాఓటర్లు 1,32,948మంది, 1,25, 148మంది పురుషులు, ట్రాన్స్‌జెండర్లు 17 మంది, సర్వీసు ఓటర్లు 293 ఉన్నారు. నిర్మల్ నియోజక వర్గ పరిధిలో మొత్తం 2,61,087 మంది ఓటర్లు ఉండగా ఇందులో మహిళా ఓటర్లు 1,37,730 మంది ఉండగా పురుషులు 1, 23,088 మంది, టాన్స్‌జెండర్లు 21మంది, సర్వీసు ఓటర్లు 248 మంది ఉన్నారు. ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,28,151 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 1,16.549 మంది, పురుషులు 1,11,157 మంది, ట్రాన్స్‌జెండర్లు 14మంది సర్వీసు ఓటర్లు 431 మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు నిర్మల్ నియోజకవర్గ పరిధిలో 14,642మంది, ముథోల్‌లో 7,800 మంది, ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలో 5,392 మంది ఎక్కువగా ఉన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.2 । కనిష్ఠం 15.6



శబరికి తరలిన అయ్యప్ప స్వాములు

తానూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలంలోని బేల్‌తరోడా, మహాలింగి, బెంబర్ గ్రామ అయ్యప్ప స్వాములు మంగళవారం శబరిలోని అయ్యప్ప స్వామి దేవాలయానికి తరలి వెళ్లారు. సాయిలు గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టుకొని యాత్ర ప్రారంభించారు. 41రోజులు పాటు కఠినమైన మండల దీక్షను నియమనిష్ఠలతో పూర్తి చేసుకున్న అయ్యప్ప స్వాములు శబరికి చేరుకొని అయ్యప్ప స్వామిని దర్శించుకుంటారు. కార్యక్రమంలో లక్ష్మణ్ గురుస్వామి, కామన్న గురుస్వామి, కన్య స్వాములతో పాటు అయ్యప్ప స్వాములు బయలుదేరారు.



నిలిచిన మాస్టర్‌ప్లాన్

నిర్మల్ పట్టణం ఇదే

నిర్మల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నిర్మల్, భైంసా మున్సిపాలిటీలకు సంబంధించి రూపొందించిన కొత్త మాస్టర్‌ప్లాన్‌పై ఇప్పటి వరకు ముందడుగు పడడం లేదు. ప్రధానంగా నిర్మల్ మున్సిపాలిటీకి సంబంధించి అప్పటి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు 2022లో ఆగమేఘాల మీద రూపొందింపజేసిన మాస్టర్‌ప్లాన్‌పై అంతటా వ్యతిరేకత ఎదురైన సంగతి తెలిసిందే. అప్పటి బీఆర్ఎస్ నేతలు కొంతమంది ఈ మాస్టర్ ప్లాన్‌ను తమకు అనుకూలంగా తయారు చేయించుకున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఇండస్ట్రీయల్ జోన్ విషయంలో రైతుల నుంచి పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కాగా 1990 మాస్టర్‌ప్లాన్ ప్రకా రం ఇండస్ట్రీయల్ జోన్ సోఫీనగర్ ప్రాంతంలో కొనసాగుతుంది. అప్పటి నుంచి ఇటీవల వరకు సోఫీనగర్ ప్రాంతమంతా ఇండస్ట్రీయల్ జోన్‌లోనే కొనసాగుతోంది. అయితే 2022లో రూపొందించిన ముసాయిదా మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇండస్ట్రీయల్ జోన్‌ను సోఫీనగర్ ప్రాంతం నుంచి తరలించి పచ్చని పంట పొలాలున్న మంజులాపూర్, తల్వేద గ్రామాలను ఇండస్ట్రీయల్ జోన్‌లోకి చేర్చారు. అయితే కొంతమంది అప్పటి ప్రజా ప్రతినిధులు ఈ మాస్టర్‌ప్లాన్‌ను తమకు అనుకూలంగా మార్చుకొని సోఫీనగర్ నుంచి ఇండస్ట్రీయల్ జోన్‌ను పథకం ప్రకారం పంట పొలా

- జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆగిపోయిన మాస్టర్ ప్లాన్
- కొత్త ప్లాన్‌లకు లభించని పరిష్కారం
- ఇండస్ట్రీయల్ జోన్‌పై ఇప్పటికీ స్పష్టత కరువు
- అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న రైతులు
- ఇప్పటి వరకు మొదలుకాని సవరణ ప్రక్రియ

లున్న గ్రామాలకు తరలించారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లావ్యాప్తంగా అప్పట్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాయి. దీనికి తోడు గా రైతులు కూడా రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టి మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనకు దిగివచ్చిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించింది. రైతులు, స్థానికుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి ఆ అభ్యంతరాలన్నింటిని పరిశీలించిన అనంతరమే కొత్తమాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తామంటూ మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు. దీంతో రైతులు తమ ఆందోళనలు తాత్కాలికంగా విరమించారు.



నిర్మల్‌లోని సోఫీనగర్ ప్రాంతంలో ఉన్న ఇండస్ట్రీయల్ పార్కు ఇదే

అనూహ్యంగా జీఓ నంబర్ 220 జారీ

నిర్మల్ మున్సిపాలిటీకి సంబంధించి కొత్తగా పొందిన మాస్టర్‌ప్లాన్‌ను నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించిన అప్పటి అధికారులు రైతులు, స్థానికులకు సంబంధం లేకుండానే జీఓ నంబర్ 220 జారీ చేయడం వివాదానికి కారణమైంది. ఈ జీఓ ప్రకారం అప్పటికే రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను ఫార్మల్ అప్రూవల్ అమలు చేయాలని ఆ తరువాత రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి మాస్టర్‌ప్లాన్‌ను ఫైనల్ అప్రూవల్ చేయనున్నట్లు ఆ జీఓలో పేర్కొన్నారు. స్థానికుల నుంచి అభ్యంతరాలను స్వీకరించేందుకు గడువు కూడా విధించారు. ఈ గడువులోగా దాదాపు 400లకు పైగా అభ్యంతరాలు వచ్చాయి. అయితే ఆ అభ్యంతరాలన్నింటిని ఆన్‌లైన్ చేసిన ఇక్కడి మున్సిపల్ శాఖ అధికారులు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖకు పంపారు. ఈ వ్యవహారమంతా అంతా జరిగి రెండేళ్ళు గడుస్తున్నప్పటికి ఇప్పటి వరకు కొత్త మాస్టర్‌ప్లాన్‌ను పూర్తిస్థాయి అప్రూవల్‌పై ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడం ఇక్కడి రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

మాస్టర్ ప్లాన్ సవరణలపై సందేహాలు

కాగా అప్పటి బీఆర్ఎస్ నేతల పలుకుబడితో రూపొందిన జీఓ నంబర్ 220 కొంతమందికే ప్రయోజనం చేకూర్చుతోందన్న ఆరోపణలున్నాయి. ఈ జీఓ జారీతో కొన్ని ప్రాంతాలకు మాత్రమే ప్రయోజనం చేకూరింది. ఇండస్ట్రీయల్ జోన్‌లో ఉన్న భూములు కమర్షియల్, రెసిడెన్షియల్ జోన్‌లోకి మారిపోయాయి. అయితే గ్రీన్ జోన్‌లో ఉన్న గ్రామాలు ఇప్పటికి కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇండస్ట్రీయల్ జోన్‌లోనే ఉండడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. తమ



మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని బీజేపీ నాయకుల ధర్నా (ఫైల్)

నుంచి అభ్యంతరాలను స్వీకరించిన ఉన్నతాధికారులు ఇప్పటి వరకు వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవడం గానీ కొత్త మాస్టర్‌ప్లాన్‌ను సవరించడం గానీ చేపట్టకపోవడంతో తమ భూములు గ్రీన్ జోన్ అలాగే రెసిడెన్షియల్ జోన్ నుంచి తొలగిపోయి ఇండస్ట్రీయల్ జోన్‌లోనే కొనసాగవచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో తాము అందజేసిన అభ్యంతరాలను సీరియస్‌గా పరిశీలించి తమ గ్రామాలను కొత్తమాస్టర్ ప్లాన్‌లో ఇండస్ట్రీయల్ జోన్ నుంచి తొలగించాలని రైతులు కోరుతున్నారు.

మాస్టర్‌ప్లాన్‌కు మోక్షం లభించేనా ?

కాగా రెండు సంవత్సరాల గడుస్తున్న నిర్మల్ మున్సిపాలిటీకి సంబందించి మాస్టర్ ప్లాన్ ఇప్పటి వరకు ఖరారుకాకపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైతులు గతంలోనే అప్పటి ముసాయిదా మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేఖంగా ఆందోళనలు జరపడంతో సమస్యను తాత్కాలికంగా వాయిదా వేసేందుకు అప్పటి అధికారులు ఆ మాస్టర్‌ప్లాన్‌ను పక్కన పెడుతున్నట్లు ప్రకటించారు. అయితే ఇదే మాస్టర్‌ప్లాన్ పరిధిలోని ఇండస్ట్రీయల్ జోన్‌లోని కొంత ప్రాంతాన్ని మాత్రం ఆ జోన్ నుంచి తొలగించి కమర్షియల్ రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చినప్పటికీ మిగతా పూర్తిస్థాయి మాస్టర్‌ప్లాన్‌ను మాత్రం ఇప్పటి వరకు ఖరారు చేయడం లేదు. దీంతో చాలా మంది ఇబ్బందులకు గురవుతున్నారంటున్నారు. ఇండస్ట్రీయల్, కమర్షియల్ జోన్ పరిధిలోకి వచ్చే వారందరికి నివసించేందుకు అవసరమయ్యే ఇనిర్మాణాలను మాత్రం చేపట్టడం సాధ్యం కాదని చెబుతున్నారు.

భైంసా, ఖానాపూర్‌లలో కూడా

భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలలో కూడా మాస్టర్‌ప్లాన్‌పై ఇప్పటి వరకు ముందడుగు పడడం లేదు. ఇక్కడి ప్రజలు తమకు కొత్త మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయాలని చాలా రోజుల నుంచి కోరుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం ఈ దిశగా స్పందించకపోవడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు మున్సిపాలిటీల్లో కూడా వెంటనే మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయాలని కోరుతున్నారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న పొన్కల్ గ్రామస్థులు

పొన్కల్ మండలం ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి

మామడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పార్లమెంటరీ సమావేశానికి వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు నిర్మల్‌లో పొన్కల్ గ్రామస్థులు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆధ్వర్యంలో మంత్రిని కలిశారు. గత ప్రభుత్వం మా గ్రామాన్ని మండలంగా ప్రకటించి జీవో ఇచ్చిన అది కలగానే మిగిలిందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దృష్టి సారించి మండలంగా ప్రకటించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించినట్లు ప్రభుత్వం దృష్టికి, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మాట్లాడుతానని గ్రామస్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పడాల శ్రీనివాస్, మంగు లింగన్న, నాయకులు మనోహర్, నర్సారెడ్డి, సుదర్శన్, గంగన్న, తదితరులు న్నారు.

వంద శాతం టాక్స్ వసూలు చేయాలి



లక్ష్మణచాంద, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వందశాతం టాక్స్ వసూలు చేయాలని ఎంపీడీవో రాధా రాథోడ్ మంగళవారం అన్నారు. పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల సర్వే బుధవారం లోగా పూర్తిచేయాలని, అలాగే ప్రతి గ్రామ పంచాయతీలోని నర్సరీలో నాణ్యమైన విత్తనాలు, ఈత మొక్కలను పెంచి రైతులకు, ప్రజలకు అందిం చాలన్నారు. టాక్స్ కలెక్షన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో అమీర్ ఖాన్, ఏపీవో ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో అధ్యాపకుల ధర్నా




యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

బాసర, జనవరి, 7: (ఆంధ్రజ్యోతి) : బాసర ట్రిపుల్ ఐటీ ఆర్జీయూకేటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ బెసిక్, హెచ్‌ఆర్‌ఏ, డీఏ 3% వార్షిక పెరుగుదలతో కూడిన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ముందు ధర్నా చే శారు. దాదాపు గంటపాటు అక్కడనే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సంఘం అధ్యక్షుడు ఉపేందర్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థ స్థాపించిన మొదటి నుంచి కాంట్రాక్ట్ వ్యవస్థతో నడుపుతున్నారన్నారు. గత 14 సంవత్సరముల నుంచి సర్వీసు అందిస్తున్నామని, కాంట్రాక్ట్ వ్యవస్థలో తమ సేవలను అందిస్తు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని, ఇక్కడ పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అందరు దేశ విదేశాలలో అత్యున్నత ప్రామాణికమైన విద్య సంస్థలలో విద్యను అభ్యసించి (ఐఐటీ, ఏన్ఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు) అత్యున్నత విద్యార్హతలను కలిగియున్నామని పేర్కొ న్నారు. అయినప్పటికి చాలి చాలని జీతాలతో మా జీవనాన్ని కొనసాగిస్తూ ఎన్నో విధాలుగా మా యొక్క ఆవేదనను గతంలో అనేక సార్లు ఆయా ప్రభుత్వాల దృష్టికి తీసుకొని వెళ్లినా మాకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్న తెలంగాణ ఉన్నత విద్యామండలి వద్ద జరిగిన మహా ధర్నా కార్యక్రమంలో చైర్మన్ బాలకిష్టా రెడ్డి మా సమస్య పరిష్కారం కొరకు మమ్ముల్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశపరిచి మా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాతమని ఆరోజు హామీ ఇచ్చారని తెలిపారు. ధర్నాలో 77 అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు పాల్గొన్నారు. అనంతరం ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, ఏవో రణధీర్‌కు వినతిపత్రం అందించారు.

నూతన మండలాల ఏర్పాటుకు కృషి

● ముధోల్ ఎమ్మెల్యే రామరావుపాటిల్

కుభీర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ముధోల్ నియోజకవర్గంలో నూతన మండలాల ఏర్పాటు కోసం తన వంతు కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావుపాటిల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రభుత్వం మంజూరు చేసిన 72 కళ్యాణ లక్ష్మీ, 4 షాదిముబారక్ చెక్కులను స్థానిక యువకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కుభీర్ మండలంలోని పల్సి, మాలేగాం, తానూర్ మండలంలోని బేల్‌తరోడా గ్రామాలను మండలాలుగా చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించడం జరిగిందని మండలాలు ఏర్పడేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుభీర్, కుంటాల, భైంసా, ముధోల్ మండలాల్లో అన్ని హంగులతో నూతన తహసీల్దార్ భవన నిర్మాణలకు నిధులు మంజూరు చేయలని రాష్ట్ర ఆర్థి మంత్రిని కోరానని పేర్కొన్నారు. కుభీర్ మండలంలోని నూతన సహకార సంఘాలు ఏర్పాటు చేస్తామన్నారు. మండలంలోని డొడర్న 5తండాలకు బీటీ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరిట ప్రజలను మోసం చేసిందన్నారు. పక్కన ఉన్న మహారాష్ట్రలో ఎన్నికలకు ముందు బీజేపీ అభ్యర్థి ఇచ్చిన హామీలను ప్రజలకు వర్తింప ... చైర్మన్,



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామరావు పాటిల్

మార్క్‌ఫెడ్ స్టేట్ డైరెక్టర్ రేకుల గంగాచరణ్, నాయకులు రమేష్, ఏశాల దత్తాత్రి, కమ్లెష్, ప్యాట లక్ష్మణ్, శేఖర్, గంగాధర్, నాగేష్, తహసీల్దార్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి

● బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధి బాజీరావ్ బోస్లే

భైంసా, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధి బాజీరావ్ బోస్లే డిమాండ్ చేశారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు సంబంధిత విషయంలో మంగళవారం రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. డిక్లరేషన్ ప్రక్రియలో భాగంగా అప్పటి పీసీసీ అధ్యక్షునిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ వర్గానికి 22 హామీలనిచ్చారని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ సర్కార్ అధికార పగ్గాలు చేపట్టి ఎడాది కాలం పూర్తయినప్పటికి బీసీ వర్గానికి ఇచ్చిన హామీలలో ఒక్క హామీని కూడా నేటికి అమలు పరచలేదని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్ సంబంధిత హామీలను విస్మరిస్తే సహించబోమని తేల్చి చెప్పారు. బీసీ వర్గానికి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన పిదపనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.బీసీ డిమాండ్ల సాధనకు పార్టీ ఆధ్వర్యంలో రాజీలేని రీతిలో పోరుబాట చేపడుతామని వెల్లడించారు. ఇందులో బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, ప్రతినిధి రావుల పోశెట్టి, ... బండారి,



భైంసా కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధి బాజీరావ్ బోస్లే

యువమోర్చా అధ్యక్షులు అనిల్, బీజేపీ ప్రతినిధులు గాలి రాజు, సుధాకర్, మహేందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు సరుకుల పంపిణీ

నర్సాపూర్(జి), జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుస్లీ గ్రామంలో రెండు నిరుపేద కుటుంబాలకు సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరో 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు. కుస్లీ గ్రామానికి చెందిన రేపన్ నాగారావు(42) నెల క్రితం మరణించారు. ఇతనికి నలుగురు కూతుళ్లు ఉన్నారు. వీరు గుడిసెలో నివాసముంటున్నారు. ఇదే గ్రామానికి చెందిన బూరుగుపల్లి భీమన్న లక్ష్మీ దంపతులకు పుట్టిన ఒక్క సంవత్సరం పాప చనిపోయింది. వీరి కుటుంబాన్ని పరామర్శించిన సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ వారికి 50 కిలోల బియ్యం ఇచ్చారు. కార్యక్రమంలో సమత ఫౌండేషన్ ఆర్గనైజర్ సాహెబ్‌రావు, సీతావో అనిల్ కుమార్, సభ్యులు ముత్యం, రవి, కుస్లీ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడి


నిర్మల్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల హెడ్‌మాస్టర్‌పై మంగళవారం గొడవపడి, కర్రతో దాడి చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... తల్వేద ఎంపీపీఎస్ నందు ఉపాధ్యాయుడిగా నాకిడి బక్కన్న పని చేస్తూ గత సంవత్సరం ఆగస్టులో చనిపోయాడు. చనిపోయిన ఉపాధ్యాయుడికి రావలసిన బిల్లులు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల వెంగ్వాపేట్‌లో చేయాల్సి ఉంది. మంగళవారం ఉదయం ఉపాధ్యాయుడి కుమారుడు నాకిడి ఆదిత్య వెంగ్వాపేట్ పాఠశాలకు వెళ్లి తండ్రికి సంబంధించిన బిల్లుల గురించి ప్రధానోపాధ్యాయుడు ఉల్లెంగుల గజ్జారాంను అడగగా కరెంటు లేదు అని చెప్పగా బయటకు వెళ్లి మళ్లీ వచ్చి బిల్లు చేయమంటే ఎందుకు చేయడం లేదని, ఇప్పుడే బిల్లు చేయమని ప్రధానోపాధ్యాయుడితో గొడవపడి, కర్రతో కొట్టారని తెలిపారు. ప్రదానోపాధ్యాయుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలి పారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి



సోన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన మోరే తిరుపతి(49) చేపలు పట్టడానికి మాదాపూర్ గ్రామ శివారు లోని గోదావరినదికి వెళ్లాడు. గాంధీ నగర్‌కు తిరిగి వచ్చే క్రమంలో మోటార్ సైకిల్‌ను అతివేగంగా నడపడంతో మార్గమధ్యలో మాదాపూర్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే మోటార్ సైకిల్ అదుపు తప్పి పడడంతో మోరే తిరుపతికి తలకు, ఛాతికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోన్ ఎస్సై కే. గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, రైతులు

లక్ష్మణచాంద, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి పరిచయ అనంతరం రైతు నేస్తం పాట, వ్యవసాయ వీడియోలు ప్రద ర్శించారు. అనంతరం యాసంగిలో మొక్కజొన్న అధిక దిగుబడులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. ప్రగతిశీల రైతు అనుభవనాలను వివ రించారు. శాస్త్రవేత్తలతో చర్చించిన అనంతరం రైతుల అనుభవాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వ్యవ సాయ విస్తరణ అధికారులు పవిత్ర, రైతులు పాల్గొ న్నారు.

భాష్యం విద్యార్థుల ప్రతిభ

ముథోల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో నిర్వహించిన అబాకస్ వేదిక్ మ్యాథ్స్ జిల్లాస్థాయి పోటీల్లో మండలంలోని ఆష్ట గ్రామంలో గల భాష్యం స్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ మాధవ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.